మేమూ ఓటు వేశాం..

జంగారెడ్డిగూడెం పట్టణం, మండలం తోపాటు కామవరపుకోటలోని పలువురు ప్రజాప్రతినిధులు తమ కుటుంబ సభ్యులతో కలిసి సోమవారం పోలింగ్ కేంద్రాలకు వెళ్లి తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. ప్రజాస్వామ్యంలో ఓటు వజ్రాయుధం వంటిదని.. ప్రతి ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకోవాలని ఈ సందర్భంగా కోరారు. – సాక్షి, నెట్‌వర్క్


ఓటు వేసేందుకు క్యూలైన్‌లో నిలబడిన మున్సిపల్ చైర్‌పర్సన్ బత్తిన లక్ష్మి


కుటుంబసభ్యులతో కలిసి ఓటు వేసిన మండవల్లి సోంబాబు


కుటుంబసభ్యులతో కలిసి ఓటు వేసిన బీవీఆర్‌చౌదరి


ఓటు వేస్తున్న వైఎస్సార్‌సీపీ పోలవరం నియోజకవర్గ పరిశీలకుడు జెట్టి గురునాథరావు


ఓటు వేసిన జెడ్పీటీసీ పోల్నాటి బాబ్జి


ఓటు వేసిన గొర్రుముచ్చు గోపాల్ యాదవ్

వెల్లివిరిసిన ఓటర్ల చైతన్యం

- ప్రశాంతగా జరిగిన పోలింగ్
- ఉదయం నుంచే పోలింగ్ కేంద్రాల వద్ద బారులు తీరిన ఓటర్లు
- కీలకం కానున్న మహిళల తీర్పు

జంగారెడ్డిగూడెం: పట్టణంలో ఓటర్ల చైతన్యం వెల్లివిరిసింది. సోమవారం ఉదయం నుంచి ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు అధిక సంఖ్యలో కదిలివచ్చారు. ఉదయం 7 గంటలకు పోలింగ్ ప్రారంభం కాగా, 6.30 గంటలకే పోలింగ్ బూత్‌ల వద్ద ఓటర్లు బారులు తీరారు. పట్టణంలో అన్ని బూత్‌ల వద్ద ఎక్కువగా మహిళలు తమ ఓటును వినియోగించుకోవడం కనిపించింది. దీంతో ఈ ఎన్నికల్లో మహిళల తీర్పు కీలకం కానుంది. మధ్యాహ్నం సమయానికి ఎండ తీవ్రతతో పాటుగా పోలింగ్ మందకొడిగా సాగినా.. తిరిగి సాయంత్రం ఓటర్లు పోలింగ్‌లో ఉత్సాహంగా పాల్గొన్నారు. పలువురు ప్రజాప్రతినిధులు తమ కుటుంబ సభ్యులతో కలిసి ఓటు హక్కు వినియోగించుకున్నారు. కాగా వైఎస్సార్‌సీపీ ఏలూరు పార్లమెంట్ అభ్యర్థి కారుమూరి సునీల్‌కుమార్, చింతలపూడి ఎమ్మెల్యే అభ్యర్థి కంభం విజయరాజులు పట్టణంలో పలు బూత్‌లలో పర్యటించి ఓటింగ్ సరళిని పరిశీలించారు.

జంగారెడ్డిగూడెం మండలంలో...

జంగారెడ్డిగూడెం రూరల్: జంగారెడ్డిగూడెం మండలంలో అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా జరిగింది. ఉదయం 7 నుంచి సాయంత్రం 6 గంటల వరకు ఓటు హక్కు వినియోగించుకునేందుకు పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లు బారులు తీరారు. టెక్కినవారిగూడెం, లక్కవరం గ్రామాల్లో ఇరు పార్టీల మధ్య కొద్దిపాటి వివాదాలు తలెత్తడంతో పోలీసులు రంగ ప్రవేశం చేసి చెదరగొట్టారు. లక్కవరం, తాడువాయి, శ్రీనివాసపురం తదితర గ్రామాల్లో పెద్ద సంఖ్యలో ఓటర్లు క్యూలైన్‌లో బారులు తీరి ఓటు వేశారు. జెడ్పీటీసీ పోల్నాటి బాబ్జి, ఎంపీపీ కొదమ జ్యోతిలతో పాటు ప్రజాప్రతినిధులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు.

కామవరపుకోటలో ప్రశాంతం..

కామవరపుకోట: కామవరపుకోట స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బూత్ నెంబర్ 184లో సుమారు 30 నిమిషాల పాటు ఈవీఎంలు మొరాయించడంతో ఓటర్లు ఇబ్బంది పడ్డారు. ఎండ తీవ్రతకు, వరసలో నిలబడిన కొందరు ఓటర్లు అస్వస్థతకు గురవడంతో అందుబాటులో ఉన్న మెడికల్ సిబ్బంది ప్రాథమిక చికిత్స చేసి పంపించారు. చింతలపూడి నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి కంభం విజయరాజు, కుటుంబ సభ్యులతో కలిసి స్థానిక సంత మార్కెట్ సమీపంలోని ఎంపీపీ స్కూల్ నందు181 బూత్‌లో ఓటు వేసి వినియోగించుకున్నారు. మండలంలో స్వల్ప సంఘటనలు మినహా, ఓటింగ్ ప్రశాంతంగా జరిగింది.

పలుచోట్ల మొరాయించిన ఈవీఎంలు

చింతలపూడి: సార్వత్రిక ఎన్నికల పోలింగ్ సోమవారం ప్రశాంతంగా ముగిసింది. ఉదయం మండలంలోని పలు గ్రామాల్లో ఈవీఎంలు పని చేయలేదు. దీంతో పోలింగ్ ఆలస్యంగా ప్రారంభమైంది. ఎన్నికల నేపథ్యంలో పోలింగ్ కేంద్రాల వద్ద భారీ పోలీసు బందోబస్తును ఏర్పాటు చేశారు. సమస్యాత్మక గ్రామాల్లో అదనపు బలగాలను మోహరించారు. చెదురుమదురు ఘటనలు మినహా పోలింగ్ ప్రశాంతంగా జరిగింది. ఉదయం 7 గంటల నుంచే ఓటర్లు భారీగా తరలి వచ్చారు. ఉదయం 11 గంటలకు కేవలం 22.08 శాతం ఉన్న పోలింగ్ శాతం 3 గంటలకు 54.3 శాతానికి, 5 గంటలకు 70 శాతం నమోదైంది. కొన్ని పోలింగ్ కేంద్రాల్లో రాత్రి 8 గంటలకు కూడా పోలింగ్ కొనసాగుతోంది. ఎన్నికల నిబంధనలు ఉన్నా అభ్యర్థులు తమ వాహనాల్లో ఓటర్లను పోలింగ్ కేంద్రాలకు చేరవేశారు. అభ్యర్థుల అనుచరులు, కార్యకర్తలు పోలింగ్ కేంద్రాల వద్ద బహిరంగంగా ప్రచారం నిర్వహిస్తుండటంతో పలుచోట్ల పార్టీల కార్యకర్తల మధ్య చిన్నపాటి ఘర్షణలు చోటు చేసుకున్నాయి.


చింతలపూడి: రాఘవాపురం జెడ్పీ హైస్కూల్‌లో వీల్ చైర్‌లో వృద్ధురాలిని తీసుకువస్తున్న పోలీస్ కానిస్టేబుల్


కామవరపుకోట: రావికంపాడు పోలింగ్ కేంద్రంలో బారులు తీరిన ఓటర్లు


జంగారెడ్డిగూడెం రూరల్: గురవాయిగూడెంలో క్యూలైన్‌లో ఓటర్లు


జంగారెడ్డిగూడెం: పోలింగ్ బూత్‌ల వద్ద క్యూలో నిలబడిన ఓటర్లు


కామవరపుకోట: జెడ్పీ హైస్కూల్లో ఓటు వేసేందుకు వెళ్తున్న వృద్ధుడు


జంగారెడ్డిగూడెం: వైఎస్సార్‌సీపీ నేతలతో కలిసి బూత్‌ల వద్ద పోలింగ్ సరళిని పరిశీలిస్తున్న ఏలూరు ఎంపీ అభ్యర్థి కారుమూరి సునీల్‌కుమార్


జంగారెడ్డిగూడెం: పాతబస్టాండ్ సమీపంలోని పోలింగ్ బూత్ వద్ద వైఎస్సార్‌సీపీ నాయకులతో ఎమ్మెల్యే అభ్యర్థి కంభం విజయరాజు


చింతలపూడి: రాఘవాపురం జెడ్పీ హైస్కూల్ పోలింగ్ కేంద్రం వద్ద ఇలా..

ప్రశాంతంగా ముగిసిన పోలింగ్

బుట్టాయగూడెం: పోలవరం నియోజకవర్గంలో సోమవారం ఎన్నికల పోలింగ్ ప్రక్రియ ప్రశాంతంగా ముగిసింది. ఉదయం 7 నుంచి సాయంత్రం 6 గంటల వరకూ జరిగిన పోలింగ్‌లో 75.37 శాతం పోలింగ్ నమోదైంది. పోలవరం నియోజకవర్గంలో 2,53,921 మంది ఓటర్లు ఉండగా సాయంత్రం 6 గంటలకు పోలింగ్ ముగిసే సమయానికి 1,91,433 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నట్లు అధికారులు తెలిపారు. కాగా ఉదయం నుంచే ఓటు వేసేందుకు పోలింగ్ బూత్‌ల వద్ద ఓటర్లు బారులు తీరారు. ఎండను సైతం లెక్కచెయ్యకుండా క్యూలో నిలబడి మరీ ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. మండలంలోని చీమలవారిగూడెంలో ఈవీఎంలు మొరాయించడంతో సుమారు గంట వరకూ ఓటర్లు క్యూలోనే ఉండిపోయారు. అలాగే బుట్టాయగూడెం మెయిన్‌స్కూల్ వద్ద ఏర్పాటు చేసిన పోలింగ్‌స్టేషన్ వద్ద ఈవీఎం కొద్దిసేపు పనిచేయలేదు. ప్రతి పోలింగ్ కేంద్రం వద్ద అత్యధికంగా మహిళలు, వృద్ధులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. కాపవరం, కేఆర్‌పురం, బుట్టాయగూడెం, దొరమామిడి, తదితర గ్రామాల్లో నడవలేని స్థితిలో ఉన్నవారిని మోసుకుంటూ వెళ్లి మరీ ఓటు వేయించారు.నియోజకవర్గంలో 284 పోలింగ్‌బూత్‌లు ఉండగా వీటిలో 146 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించి అక్కడ భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఎక్కడా ఎటువంటి ఘటనలు చోటు చేసుకోకుండా ప్రశాంతంగా పోలింగ్ ప్రక్రియ ముగియడంతో అధికారులు ఊపిరి పీల్చుకున్నారు.

కుక్కునూరు మండలంలో...

కుక్కునూరు: కుక్కునూరు మండలంలో చెదురుమదురు ఘటనలు మినహా దాదాపు పోలింగ్ ప్రశాంతంగా సాగింది. మండల వ్యాప్తంగా 5 గంటల సమయం వరకు 70 శాతం పోలింగ్ నమోదైనట్లు అధికారులు తెలిపారు. కాగా, మండలంలోని రామచంద్రాపురం, కుక్కునూరు, మరికొన్ని ప్రాంతాల్లో ఈవీఎంలు మొరాయించడంతో పోలింగ్ ప్రక్రియ ఆలస్యమైంది. కుక్కునూరులో 6 గంటల తరువాత కూడా పోలింగ్ ప్రక్రియ కొనసాగగా మాధవరంలో 8 గంటలకు కూడా పోలింగ్ ప్రక్రియ కొనసాగుతోంది. కాగా టీడీపీ నాయకులు నిబంధనలకు విరుద్ధంగా పసుపుపచ్చ చొక్కాలు ధరించి కవ్వింపు చర్యలకు పాల్పడటంతో కుక్కునూరు, సీతారామనగరం తదితర ప్రాంతాల్లో కొంత ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. పోలీసులు రంగ ప్రవేశం చేసి ఇరువర్గాలను చెదరగొట్టడంతో గొడవ సద్దుమణిగింది. ఉప్పేరు పోలింగ్ స్టేషన్‌లోకి టీడీపీకి చెందిన పాస్‌లు లేని వారిని అధికారులు ఇష్టారీతిగా అనుమతించడంతో వైఎస్సార్ సీపీ నాయకులు అధికారులతో వాగ్వివాదానికి దిగారు. టీడీపీ, జనసేన నాయకులు యథేచ్ఛగా కోడ్ ఉల్లంఘనలకు పాల్పడ్డారు.

పోలవరం మండలంలో...

పోలవరం రూరల్: మండలంలో ఉదయం 7 గంటల నుంచే ఓటర్లు క్యూలైన్‌లో బారులు తీరారు. ప్రారంభంలో ఈవీఎంలు కొంతసేపు మొరాయించినప్పటికీ అధికారులు వెంటనే సరిచేసి పోలింగ్ ప్రారంభించారు. ప్రధానంగా గతంలో ఎన్నడూ లేని విధంగా ఈ సారి అత్యధిక శాతం ఓటర్లు ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఇతర రాష్ట్రాల్లో ఉన్న వారు కూడా వచ్చి ఓటు హక్కు వినియోగంచుకోవడం విశేషం. ఏజెన్సీ ప్రాంతంలో కూడా అత్యధిక శాతం పోలింగ్ జరిగింది. పురుషులు కంటే మహిళలే ఓటు ఎక్కువశాతం వినియోగించుకున్నారు. సమస్యాత్మక గ్రామాల్లో పోలీసులు ప్రత్యేక బందోబస్తు నిర్వహించడంతో ఎటువంటి అవాంఛనీయ ఘటనలకు తావు లేకుండా ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించారు.

కొయ్యలగూడెం మండలంలో...

కొయ్యలగూడెం: మండల వ్యాప్తంగా ఉన్న 64 పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లు అధిక సంఖ్యలో తమ ఓటును వినియోగించుకున్నారు. కొయ్యలగూడెంలోని 216 పోలింగ్ బూత్, బయ్యన్నగూడెం, పరింపూడి హైస్కూల్‌లలోని పోలింగ్ కేంద్రాల్లో ఈవీఎంలు మొరాయించడంతో అరగంటపాటు ఆలస్యంగా ఎన్నికల ప్రక్రియ ప్రారంభం అయ్యింది. కన్నాపురం రోడ్డులోని మెయిన్ స్కూల్‌లో ఓటర్లు బారులు తీరి తమ ఓటు హక్కు వినియోగంచుకున్నారు. రాజవరం, బయ్యనగూడెం, కొయ్యలగూడెం పోలింగ్ కేంద్రాల్లో రాత్రి 8 గంటలు దాటిన తరువాత కూడా అప్పటికే పోలింగ్ కేంద్రాలకు చేరుకున్న ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోవడానికి పోలింగ్ కేంద్రం కాంపౌండ్‌లో వేచి ఉన్నారు. పోలింగ్ కేంద్రాలను వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి తెల్లం రాజ్యలక్ష్మి , ఎంపీ అభ్యర్థి కారుమూరి సునీల్, ఎమ్మెల్యే తెల్లం బాలరాజు సందర్శించారు.

పొద్దుపోయేంత వరకు కొనసాగిన పోలింగ్

టి.నరసాపురం: పలుచోట్ల ఈవీఎంలు మొరాయించి అరగంట నుంచి రెండున్నర గంటల వరకు ఆలస్యంగా ఓటింగ్ ప్రారంభమైంది. తెడ్లంలో ఈవీఎంలు మొరాయించి 2.30 గంటలు ఆలస్యంగా 9.30 గంటలకు ఓటింగ్ ప్రారంభమైంది. అలాగే మక్కిగూడెంలో ఒక గంట, కె.జగ్గవరంలో 45 నిమిషాలు, మెట్టగూడెంలో 2 గంటలు, తిరుమలదేవిపేటలో 1.30 గంటలు ఆలస్యంగా ఓటింగ్ ప్రారంభమైంది. ప్రకాశ్‌నగర్‌లో వీవీ ప్యాట్‌లో 7 సెకండ్లపాటు కనిపించాల్సిన స్లిప్‌లు అయిపోవడంతో 2 గంటలు ఓటింగ్ నిలిచిపోయింది. మండలంలో తెడ్లం, కె.జగ్గవరం, బండివారిగూడెం, బొర్రంపాలెంలలో రాత్రి పొద్దుపోయే వరకు ఓటింగ్ ప్రక్రియ కొనసాగుతోంది. మండలంలో 46 పోలింగ్ కేంద్రాల్లో 46,094 మంది ఓటు హక్కు వినియోగించుకోవాల్సి ఉండగా, సాయంత్రం 6 గంటలకు మండలంలో 75 శాతం పోలింగ్ నమోదైంది.


బుట్టాయగూడెం: కాపవరంలో ఓటు వేసేందుకు తీసుకువస్తున్న దృశ్యం


బుట్టాయగూడెం: చీమలవారిగూడెంలో ఈవీఎంలు మొరాయింపుతో ఇదీ పరిస్థితి


కొయ్యలగూడెం: దిప్పకాయలపాడులో ఓటు వేసిన మహిళలు

పోటెత్తిన ఓటర్లు..

ద్వారకాతిరుమల: మండలంలో సోమవారం పలు చదురుమదురు ఘటనలు మినహా పోలింగ్ ప్రశాంతంగా జరిగింది. గతంలో ఎన్నడూ లేని విధంగా ఓటర్లు పెద్ద ఎత్తున పోలింగ్ కేంద్రాల వద్ద బారులు తీరడంతో పండుగ వాతావరణం కనిపించింది. వృద్ధులు, గర్భిణీ స్త్రీలు, బాలింతలు సైతం తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు పోలింగ్ కేంద్రాలకు చేరుకున్నారు. పంగిడిగూడెం, దొరసానిపాడు తదితర గ్రామాల్లో స్వల్ప గొడవలు జరగ్గా, కోడిగూడెంలో వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ అద్యక్షుడు చెలికాని బుల్లియ్యపై పోలీసులు దురుసుగా ప్రవర్తించారు. అలాగే అక్కడ ఒక వ్యక్తిపై పోలీసులు దాడి చేశారు. దాంతో ఆ ప్రాంతంలో కొద్దిసేపు ఉద్రిక్తత నెలకొంది. తిమ్మాపురంలో దొంగ ఓటు వేస్తున్న వ్యక్తిని వైఎస్సార్ సీపీ నాయకులు పట్టుకుని పోలీసులకు అప్పగించారు. ఇదిలా ఉంటే పలు పోలింగ్ బూత్‌లలో ఈవీఎంలు నెమ్మదిగా పనిచేయడంతో పోలింగ్ ఆలస్యంగా జరిగింది. మండలంలోని దొరసానిపాడు, కోడిగూడెం, తిరుమలంపాలెం, పంగిడిగూడెం, ఐఎస్ జగన్నాధపురం తదితర గ్రామాల్లో అర్ధరాత్రి వరకు పోలింగ్ జరిగింది. రాష్ట్ర హోం మంత్రి, వైఎస్సార్ సీపీ గోపాలపురం నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి తానేటి వనిత సాయంత్రం ద్వారకాతిరుమలలోని పోలింగ్ కేంద్రాల వద్దకు చేరుకుని పార్టీ నాయకులతో మాట్లాడారు.


ద్వారకాతిరుమల: పి.కన్నాపురంలో పోలింగ్ కేంద్రం వద్ద బారులు తీరిన ఓటర్లు

జంగారెడ్డిగూడెంలో 65.79 శాతం పోలింగ్ నమోదు

జంగారెడ్డిగూడెం: పట్టణంలో 65.79 శాతం పోలింగ్ నమోదైంది. పట్టణంలో 48,484 మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో పురుషులు 23,437, మహిళలు 25,019, ట్రాన్స్ జెండర్లు 28 మంది ఉన్నారు. కాగా, పట్టణంలో 31,900 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. వీరిలో పురుషులు 15,498 మంది, మహిళలు 16,383 మంది, ట్రాన్స్ జెండర్లు 19 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు.

రాత్రి వరకూ కొనసాగిన పోలింగ్

జంగారెడ్డిగూడెం రూరల్: మండలంలోని పలు గ్రామాల్లో సోమవారం రాత్రి వరకూ పోలింగ్ కొనసాగింది. శ్రీనివాసపురంలో రాత్రి 8:30 గంటల వరకు, కేతవరంలో రాత్రి 8:45 గంటల వరకు, లక్కవరంలో రాత్రి 9 గంటల వరకు పోలింగ్ కొనసాగింది. ఓట్లు వేసేందుకు ప్రజలు క్యూలైన్‌లో బారులు తీరారు.

పోలవరంలో వైఎస్సార్ సీపీ గెలుపు ఖాయం

బుట్టాయగూడెం: పోలవరం వైఎస్సార్‌సీపీ అభ్యర్థిని తెల్లం రాజ్యలక్ష్మి, ఎమ్మెల్యే తెల్లం బాలరాజు వారి కుమారులు సాయి విశాల్, రోహిత్‌లతో కలిసి సోమవారం వారి స్వగ్రామమైన బుట్టాయగూడెం మండలం దుద్దుకూరులో ఓటు హక్కును వినియోగించుకున్నారు. ప్రజలతోపాటు క్యూలో నిలబడి ఓటు వేశారు. అనంతరం వారు మాట్లాడుతూ పోలింగ్ సరళిని పరిశీలిస్తే వైఎస్సార్‌సీపీకే ప్రజలు మద్దతు పలికినట్లు తెలుస్తుందని అన్నారు. తప్పనిసరిగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మరొక్కసారి ప్రభుత్వాన్ని ఏర్పాటు చెయ్యడం ఖాయమన్నారు. అలాగే పోలవరం నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ జెండా ఎగరడం ఖాయమని అన్నారు.

వేలేరుపాడులో 90.93 శాతం పోలింగ్


చాగరపల్లి పోలింగ్ కేంద్రంలో రాత్రి 7.30కి కూడా కొనసాగుతున్న పోలింగ్

వేలేరుపాడు: వేలేరుపాడు మండలంలో ఓటర్లలో చైతన్యం వెల్లివిరిసింది. సోమవారం ఉదయం నుంచి ఎండతీవ్రత ఎక్కువగా ఉన్నప్పటికీ, ఓటు హక్కును వినియోగించుకునేందుకు జనం బారులు తీరారు. మండలంలో 22 పోలింగ్ కేంద్రాల్లో మొత్తం 17,596 ఓటర్లకుగాను మొత్తం 16,622 ఓట్లు పోలయ్యాయి. 90.93 శాతం పోలింగ్ నమోదైంది. అత్యధికంగా నార్లవరం(47) పోలింగ్ కేంద్రంలో 94.75 శాతం నమోదు కాగా, అతిస్వల్పంగా 71.29 శాతం రేపాకగొమ్ము(35)లో నమోదైంది.

బోటెక్కి వచ్చి... ఓటు...

మండలంలో దట్టమైన అటవీ ప్రాంతంలో ఉన్న కాకిస్‌నూరు పోలింగ్ కేంద్రం పరిధిలోని పేరంటపల్లి టేకుపల్లి, చినమకోలు, పెదమంకోలు గ్రామాల ఓటర్లు గోదావరిలో బోటు పై వచ్చి తమ ఓటును వినియోగించుకున్నారు. ఆయా గ్రామాల నుంచి 472 మంది ఓటర్లు కాకిస్‌నూరు పోలింగ్ కేంద్రానికి వచ్చారు. ఈ పోలింగ్ కేంద్రంలో మొత్తం 472 ఓట్లుండగా, 440 ఓట్లు పోలయ్యాయి. అత్యంత మారుమూలనున్న కాకిస్‌నూరులో 93.22 శాతం పోలింగ్ నమోదైంది. ఇక్కడి ఓటర్లకు అధికారులు బోటుసౌకర్యం కల్పించారు.

మొరాయించిన ఈవీఎంలు

వేలేరుపాడు: సార్వత్రిక ఎన్నిల్లో భాగంగా పోలవరం నియోజకవర్గంలోని వేలేరుపాడు మండలంలో కొయిదా పోలింగ్ కేంద్రం (51)లో సాంకేతిక లోసం కారణంగా ఈవీఎం పనిచేయలేదు. ఇక్కడ ఉదయం 7 గంటలకే ఓటర్లు పోలింగ్ కేంద్రానికి చేరుకున్నప్పటికీ, ఈవీఎం సాంకేతిక లోపం వల్ల 8.30 గంటలకు పోలింగ్ ప్రారంభమైంది. జగన్నాధపురం, (39), కన్నాయిగుట్ట (46), చాగరపల్లి (40), పోలింగ్ కేంద్రాల్లో ఈవీఎంల సాంకేతికలోపం వల్ల ఆలస్యంగా పనిచేస్తుండటంతో పోలింగ్ మందకొడిగా సాగింది. చాగరపల్లి పోలింగ్ కేంద్రంలో రాత్రి 7.30 వరకు పోలింగ్ కొనసాగింది. ఇక్కడ 1226 ఓటర్లు ఉన్నారు. ఇక్కడ ఓటర్లకు సరిపడా టెంట్‌లు ఏర్పాటుచేయకపోవడంతో ఓటర్లు ఎండలో నిలబడాల్సి వచ్చింది. జగన్నాధపురం, (39) 901 ఓటర్లున్న జగన్నాధపురం పోలింగ్ కేంద్రం అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించడంతో ఇరుగు గదులు కావడం వల్ల ఓటర్లు నానా ఇబ్బందులు పడ్డారు.


టి.నరసాపురం: బొర్రంపాలెంలో బారులు తీరిన ఓటర్లు


పోలవరం రూరల్: జూనియర్ కళాశాలలో పోలింగ్ బూత్ వద్ద ఇలా..


కుక్కునూరు: పోలింగ్ కేంద్రం వద్ద ఓటర్ల క్యూ


బుట్టాయగూడెం: పులిరామన్నగూడెంలో ఓటర్ల క్యూ


కుక్కునూరు: పోలింగ్ కేంద్రాల వద్ద బారులు తీరిన ఓటర్లు


ద్వారకాతిరుమల: పంగిడిగూడెంలో నిలబడలేక కూర్చున్న మహిళలు